సాక్షి పార్వతీపురం మన్యం

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి
ప్రతి ఒక్కరికీ మేలుచేశాం.. ఓటుతో ఆశీర్వదించాలని మంత్రి బొత్స సత్యనారాయణ ఓటర్లకు పిలుపునిచ్చారు.
- 8లో



ఉన్న ఊరిలోనే 'ఉపాధి'
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. ఉన్న ఊరిలోనే ఉపాధి కలుగుతోంది.
- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ (సా॥)	బుధ (ఉ॥)
6.15	4.26

న్యూస్‌రీల్

నేడు వై.వి.సుబ్బారెడ్డి రాక



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో నిర్వహించే సమావేశంలో పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి. సుబ్బారెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేస్తారన్నారు. ప్రతీ గ్రామం, వార్డు నుంచి పార్టీ ముఖ్య నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సభా ప్రాంగణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు.

సీటు కోసం సైకిల్

- జనసేనలో చేరిన టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి జయకృష్ణ
- స్వార్థరాజకీయాలపై విమర్శల వెల్లువ
- టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం



జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరిన టీడీపీ ఇన్‌చార్జి జయకృష్ణ

వీరఘట్టం: 'ఆవు చేను మేస్తే...దూడ గట్టు మేస్తుందా అనే సామెతలా'ఉంది పాలకొండ నియోజకవర్గంలోని టీడీపీ నాయకుల తీరు. అధికార దాహంతో తమ నాయకుడు చంద్రబాబునాయుడు కనీసం విలువలు పాటించకుండా రాజకీయాలు చేస్తున్నాడు.. ఇక్కడ కూడా అటువంటి పరిస్థితే నెలకొంది. నిన్నటి వరకు జనసేనను హేళనగా చూసినవారంతా నేడు సీటు కోసం టీడీపీని వీడి జనసేనకు వలస కడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తులో భాగంగా పాలకొండ సీటును జనసేనకు కేటాయించిన విషయం తెలిసిందే. పాలకొండ నియోజకవర్గంలో కనీసం 2 శాతం కూడా ఓటు బ్యాంకు లేని జనసేనకు పాలకొండ టికెట్‌ను కేటాయించడం ఎంత వరకు సమంజసమని ఇటీవల స్థానిక టీడీపీ నేతలు చంద్రబాబును దుయ్యబట్టారు. జనసేన పాలకొండ టికెట్‌ను కేటాయిస్తే తాము ఇండిపెండెంట్‌గా పోటీ చేయడానికి వెనుకాడబోమని టీడీపీ అధిష్టానానికి హెచ్చరికలు జారీచేశారు. వీరెన్ని నిరసనలు తెలిపినా, ఎన్ని బెదిరింపులుకు పాల్పడినా చంద్రబాబునాయుడు కనీసం పట్టించుకోలేదు. దీంతో పాలకొండ టీడీపీ నాయకులు స్వార్థరాజకీయాలకు తెరతీశారు. జనసేన పంచన చేరేందుకు గత కొద్ది రోజులుగా ప్రయత్నాలు చేశారు. చివరకు సోమవారం పిఠాపురంలో పాలకొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీ ఇన్‌చార్జ్ పదవికి రాజీనామా చేయకుండానే జనసేనలో జయకృష్ణ చేరడంపై టీడీపీ సీనియర్ నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

సీటు కోసం ఎందుకీ పాట్లు....

పాలకొండ నియోజకవర్గంలో బలమైన శక్తిగా ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవడం ప్రతిపక్షాల వల్ల సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి అఖండ మెజార్టీతో గెలుస్తుందని సర్వే రిపోర్టులు చెబుతున్నాయి. అలాంటప్పుడు టీడీపీ నాయకులు సీటు కోసం ఎందుకింత ఆరాటపడుతున్నారన్నది రాజకీయ విశ్లేషకుల వాదన. ఎన్నికల ఖర్చుల కోసం పార్టీ ఇచ్చే ఫండ్ కోసమే స్థానిక నాయకులు ఆరాటపడుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రతినెలా ఒకటో తేదీన ఆరు గంటలకు ఠంచన్‌గా మీ ఇంటికే పింఛన్ తెచ్చే వలంటీర్లు ఇప్పుడు మీకు కనిపించకపోవచ్చు.. కరోనా వంటి కష్టకాలంలో మేమున్నామంటూ ముందుకొచ్చే సేవకులు మీకు కొద్దిరోజులు దూరం కావచ్చు.. వృద్ధాప్యంలో ఉన్నా సరే.. లేవలేని స్థితిలో ఉన్నా సరే.. ఇప్పుడు పింఛన్ మొత్తం పొందాలంటే మీరు సచివాలయాలకు కాళ్లీడ్చుకుంటూ వెళ్లక తప్పకపోవచ్చు.. పింఛన్ కోసం నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మీరు పడిన బాధలు పునరావృతం కావొచ్చు.. అంతే కాదు, ప్రభుత్వ పరంగా పొందాల్సిన ఏ చిన్న పనికైనా పిలిచిన వెంటనే పలికే మన వలంటీరు చెల్లి/తమ్ముళ్లూ ఎన్నికల కోడ్ ముగిసే వరకూ చెంత ఉండకపోవచ్చు. దీనంతటికీ కారణం.. సేవా వారధులైన వలంటీర్లపై చంద్రబాబు అండ్ కోకు ఉన్న ద్వేషం. అభాగ్యులు, అవ్వాతాతలైన పింఛనుదారులను ఇబ్బందులు పెట్టాలన్న కుటిల మనస్తత్వం.



వలంటీర్ల సేవలపై..
కాలకూటమి విషం!

- పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పించాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు
- అవ్వాతాతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు శరాఘాతం
- చంద్రబాబుకు వారిపై ఎందుకంత ద్వేషం
- కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ధైర్యంగా వీధుల్లోకి వచ్చిన సేవా వారధులపై అక్కసేల?

సాక్షి, పార్వతీపురం మన్యం:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చి.. వారి ద్వారా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే ప్రభుత్వపరమైన అన్ని సేవలనూ అందించింది. ప్రధానంగా ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే ఇంటి ముంగిట వాలిపోయి.. అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ, చేతిలో రూ.3 వేల పింఛన్ పెడుతూ.. నిర్భాగ్యుల కళ్లలో ఆనందానికి కారణమయ్యేవారు వలంటీర్లు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఏ పథకమైనా క్షేత్రస్థాయిలో లబ్ధిదారుకు నేరుగా చేరడానికి కారణం వీరే. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో.. ఇళ్ల నుంచి బయటకు రావడానికే అందరూ భయపడుతున్న సమయంలో ధైర్యంగా ముందుకు వచ్చి ప్రభుత్వ నగదు సహాయాన్ని ప్రతి ఇంటికీ చేర్చారు. రేషన్ సరకులు అందించారు. పింఛన్ల పంపిణీకి ఆటంకాలు లేకుండా సేవలందించారు. అటు గ్రామాల్లోగానీ, ఇటు వార్డుల్లోగానీ ప్రజలకు తలలో నాలుకలా మారారు. వీరి సేవలకు గానూ ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ వేతనం అందిస్తూ సముచిత స్థానం ఇచ్చింది. ఇటువంటి వ్యవస్థపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆ పార్టీ నాయకులు బహిరంగంగానే పలుమార్లు విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తామని ప్రకటనలు చేశారు.

నేడు పింఛన్ల పంపిణీని అడ్డుకున్న వైనం

ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవ్వాతాతలకు, ఇతర నిర్భాగ్యులకు సామాజిక పింఛన్ కింద నెలకు రూ.3 వేలు చొప్పున అందిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు.. ఇలా సుమారు 1.46 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.43 కోట్ల మేర ప్రభుత్వం చెల్లిస్తోంది. సచివాలయాల నుంచి నగదు తీసుకుని వలంటీర్లే నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వేలిముద్ర సేకరించి ఆ మొత్తం అందజేసేవారు. ఇప్పుడు వలంటీర్లతో పింఛన్ల పంపిణీని నిలుపు చేయాలంటూ టీడీపీ అనుకూల వ్యక్తులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. హైకోర్టుకూ వెళ్లారు. దీంతో కోడ్ ముగిసే వరకూ పింఛన్ల పంపిణీని వలంటీర్లతో చేపట్టవద్దని అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశించింది. ఫలితంగా లబ్ధిదారులు ఈ రెండు నెలలూ సచివాలయాల వద్దకే వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రభావం తమపై పడుతుందని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల మంచం మీద లేవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు తప్పవు. ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు సైతం మానవతాదృక్పథంతో అక్కడికే వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందించే వారు. ఇటువంటి వారికీ ఇప్పుడు పింఛన్ మొత్తం దూరమవుతుంది. టీడీపీ హయాంలో పింఛన్ కోసం ఎక్కడికో వెళ్లి గంటలకొద్దీ ఎదురుచూపులు చూసేవారమని.. మళ్లీ ఇప్పుడు ఆ పరిస్థితులు అదే చంద్రబాబు దయ వల్ల పునరావృతం అవుతాయని లబ్ధిదారులు వాపోతున్నారు. మా ఉసురు మంట తప్పక ఆయనకు తగులుతుందని వృద్ధులు శాపనార్థాలు పెడుతున్నారు.



పార్వతీపురం పట్టణంలో లేవలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న వలంటీర్లు (ఫైల్)

మాపై ఎందుకంత కక్ష



నా పేరు వసంతల సోములమ్మ. కొమరాడ మండలం కంబవలస పంచాయతీ పరిధిలోని రాజ్యలక్ష్మీపురం. నేను నడవలేను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ తీసుకునేందుకు ప్రయాసలు పడేదాన్ని. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెలా ఇంటివద్దనే పింఛన్ డబ్బులు అందుతున్నాయి. ఇప్పుడు మళ్లీ కార్యాలయాలకు వెళ్లమంటున్నారు. మా లాంటి వృద్ధులపై చంద్రబాబుకు ఎంతకంత కక్ష.

మంచం నుంచి కదలలులేను



నా పేరు బండి పార్వతి. మాది పాలకొండ మండలంలోని కొండాపురం గ్రామం. వృద్ధురాలిని, కళ్లు పూర్తిగా కనబడవు. కొన్నేళ్లుగా మంచం మీద నుంచి దిగలేను. ప్రతి నెల పింఛన్ డబ్బులను వలంటీర్ ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు ఏమి చేయాలో తెలియడంలేదు.

ఇలాగైతే మళ్లీ అప్పటి కష్టాలే..



అప్పట్లో పింఛన్ కోసం మాలాంటి వృద్ధులు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఎప్పుడిచ్చేవారో తెలియదు. ఎన్ని గంటలకు ఇచ్చేవారో తెలియదు. ఆకలి దప్పులతోనే గంటలకొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇంటికే వలంటీర్లు తెచ్చి పింఛన్ అందిస్తున్నారు. మాకు ఏ సమస్య కూడా లేకుండా చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ సచివాలయాలకే వెళ్లి తీసుకోవాలని చెబుతున్నారు. అక్కడ ఎన్ని ఇబ్బందులు పడాలో. వెళ్లకపోతే పింఛన్ మీదే ఆధారపడే మాలాంటి జీవితాలకు కష్టమే.

– శ్రీరాములు, పార్వతీపురం మండలం

పింఛన్ కోసం ఎదురుచూపులే..

గత టీడీపీ హయంలో పింఛన్ పొందాలంటే రోజుల తరబడి వేసి ఉండి నానా ఇబ్బందులు పడేవారం. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పింఛన్‌ను ఇంటివద్దకే వలంటీర్లతో అందజేస్తున్నారు. ఈనెల పింఛన్ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల సేవలకు ప్రతిబంధకం కల్పించడం సరికాదు.

– మద్రాపు సన్యాసినాయుడు, దివ్యాంగుడు, పెద్దూరు గ్రామం, గరుగుబిల్లి మండలం

పింఛన్ కోసం నేనెలా వెళ్లేది..



నా పేరు కొత్తకోట భీమారావు. భామిని మండలంలోని సొలికిరి గ్రామం. అనారోగ్య సమస్యలతో మంచంపట్టాను. కనీసం లేవలేని పరిస్థితి. కేవలం పింఛన్‌పై ఆధారపడి బతుకుతున్నాను. నెలలో తొలి రోజునే వలంటీర్లు మా గడప వద్దకు వచ్చి పింఛన్ అందించేవారు. టీడీపీ అధినేత చంద్రబాబు, అనుచరవర్గం కారణంగా వలంటీర్ల సేవలు నిలిపేశారని తెలిసింది. ఇప్పుడు మాలాంటి నిర్భాగ్యులకు పింఛన్ అందించేది ఎవరు. చంద్రబాబు రాజీకీయ స్వార్థంతో ఈ పనికి దిగాడు. నాలాంటి ఎందరో వృద్ధులు అవస్థలు పడతారు. ఈ పాపం ఊరికనే పోదు.

వలంటీర్లపై ఎందుకంత ద్వేషం?



వలంటీర్లపై ద్వేషంతో మాలాంటి దివ్యాంగులను ఇబ్బంది పెట్టడం సరికాదు. అయినా, వాలంటీర్ల మీద ఎందుకంత కోపం. వారు మాకు ఎంతగానో సహాయం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.3 వేల పింఛన్ నాకు ఎంతగానో ఉపయోగపడేది. నడవలేని స్థితిలో ఉన్న నాలాంటి దివ్యాంగులకు ప్రతి నెలా ఇంటికే తెచ్చి పింఛన్ మొత్తం అందించేవారు. ఇప్పుడు వాలంటీర్లతోపాటు, మా మీద కూడా పగబట్టినట్లే.

– భూపతి ధనలక్ష్మి, దివ్యాంగురాలు, తాళ్లపూడి గ్రామం

నాకు నడిచే ఓపిక లేదు



వీరఘట్టంకు 2 కి.మీ దూరంలో ఉన్న అచ్చెపువలస గ్రామం మాది. ఈ నెల నుంచి వీరఘట్టం సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. నా ఆరోగ్యం బాగోలేదు. నాకు నడిచే ఓపిక కూడా లేదు. పింఛన్ తీసుకోకపోతే ఈ నెల నాకు పస్తులే గతి. నాలాంటి వాళ్లు చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేలా చూడండి. అయినా చంద్రబాబు నాయుడుకి మాలాంటి ముసలోళ్ల మీద ఎందుకింత పగ.

– ఆరిక పైడమ్మ, వీరఘట్టం పంచాయతీ, అచ్చెపువలస, పార్వతీపురం మన్యం జిల్లా

మాలాంటి వారిమీదా.. నీ కోపం



చేతి కర్ర సాయం లేకుండా కనీసం మంచం మీద నుంచి కిందకు దిగలేను. ప్రతినెలా ఒకటో తేదీన తెల్లారే సరికి వలంటీరు వచ్చి పింఛన్ ఇచ్చేది. చంద్రబాబూ...మాలాంటి వాళ్ల మీద తమరికి ఎందుకంత కోపం. పింఛన్ కోసం కి.మీ. దూరంలో ఉన్న సచివాలయానికి నేను ఎలా వెళ్లగలను.

– బొడ్డాన నారాయణమ్మ, వీరఘట్టం, పార్వతీపురం మన్యం జిల్లా

గిరిజనులపై ఒడిశా దౌర్జన్యాన్ని సహించేది లేదు

- ఒడిశా అధికారుల తీరుపై డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆగ్రహం



మాట్లాడుతున్న డిప్యూటీసీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: ఒడిశా అధికారులు కొటియా గ్రూపు గ్రామాల గిరిజనులపై దౌర్జన్యంచేస్తూ వారి జీవనానికి ఆటంకం కలిగిస్తే సహించేదిలేదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర హెచ్చరించారు. సాలూరులో స్థానిక విలేకరులతో సోమవారం సాయంత్రం మాట్లాడారు. అమాయక గిరిజనుల అనుమతి లేకుండా కట్టడాలు, గనుల తవ్వకాలు చేపట్టరాదన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని కోరారు. ఎగువశెంబి గ్రామంలో ఒడిశా అధికారులు తవ్వకాలు చేపట్టడం తగదన్నారు. పొరుగు రాష్ట్రాలతో స్నేహపూర్వకంగా మెలగాన్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ముఖ్య ఉద్దేశమన్నారు. వివాదాస్పద భూభాగం విషయమై 2021 నవంబర్‌లో ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్‌తో మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇరు రాష్ట్రాల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఘటనలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల వేళ కొటియా గ్రామాల్లో ప్రత్యేక దళాలను బందోబస్తుకు నియమించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్‌కు సూచించారు.

పన్నుల వసూలులో పాలకొండ ముందంజ



సిబ్బందిని అభినందిస్తున్న కమిషనర్

పాలకొండ: ఆస్తి పన్ను వసూలులో పాలకొండ నగరపంచాయతీ రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచిందని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. పన్నుల వసూలు సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను వసూలు చేయడంతో ప్రతిభ చూపిన సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి నగరపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయనతో పాటు మేనేజర్ టి.జయరాం ఉన్నారు.

విద్యలనగరంలోని మట్టిని నేను...

- పైడితల్లి ఆశీస్సులే ఇంతవరకు తెచ్చాయి..
- గాన కోకిల సుశీలమ్మ
- ఆమెకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం
- మణిశర్మ, కుశపాత్రధారి సుబ్రహ్మణ్యంకు ఆత్మీయ సత్కారాలు
- అలరించిన సినీ సంగీత విభావరి
- వేడుకగా గురునారాయణ కళాపీఠం తృతీయవార్షికోత్సవం



సుశీలకు పూల కిరీటాన్ని అలంకరించి సత్కరిస్తున్న సంగీత దర్శకుడు మణిశర్మ, లవకుశలో నటుడు సుబ్రహ్మణ్యం, సంస్థ సభ్యులు

విజయనగరం టౌన్: విద్యలనగరంలోని మట్టిని నేను.. నేనో ప్రత్యేక మట్టిని.. పైడితల్లి ఆశీస్సులే తనను ఈ స్థాయికి తీసుకొచ్చాయని గానకోకిల పి.సుశీల పేర్కొన్నారు. రెండు రోజుల కిందట పడిపోయానని, అయినా, ఆ తల్లి ఇక్కడవరకూ తీసుకువచ్చిందన్నారు. విజయనగరంలోని పుట్టి.. సంగీత రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన గాన కోకిల, పద్మభూషణ్ డాక్టర్ పి.సుశీలమ్మను విజయనగర వాసులు ఘనంగా సత్కరించారు. శ్రీ గురునారాయణ కళాపీఠం తృతీయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆనందగజపతి కళాక్షేత్రంలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. దుశ్శాలువ, జ్ఞాపికలను అందజేసి ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ప్రఖ్యాత సినీసంగీత దర్శకుడు మణిశర్మ, లవకుశ చిత్రంలో కుశుడు పాత్రధారి వియ్యూరి సుబ్రహ్మణ్యంకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా విజయనగర వాసులనుద్దేశించి సుశీలమ్మ మాట్లాడుతూ తను పుట్టిన గడ్డపైనే ఆ దేవుడు ఘంటసాలను తీసుకువచ్చి, తనను సృష్టించి మర్చిపోలేనటువంటి ఖ్యాతిని విజయనగరానికి తెప్పించాడన్నారు. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి, డి.కె.పట్టమ్మాల్ వంటి పెద్దల ఆశీస్సులు పొందానన్నారు. సంగీతంలో రాణించడంతో తన తండ్రికి ఆత్మ తృప్తి కలిగిందని తెలిపారు. మణిశర్మ తండ్రి శర్మ గాయత్రీ మంత్రం పాడించి, అర్థాలు చెప్పమనేవారని, తనచేత పాడించేవారని గుర్తుచేశారు. మణిశర్మ కాదయ్యా... శాస్త్రి గారు ఇచ్చిన మణి అని పేర్కొన్నారు. చాలా సంతోషంగా ఉందని, ఇదంతా గురునారాయణ కళాపీఠం నారాయణకే చెల్లిందన్నారు. ఈ గడ్డపై ఎవరు పుట్టినాసరే ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ రాగాలు తీస్తూ.. గొంతు బాగుందా అంటూ అందరినీ ఆశ్చర్యపరిచారు. మనసెరిగిన వాడు మా దేవుడు.. శ్రీరాముడు... అంటూ భక్తి గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ఎంతోమందికి సంస్కృతి, సంప్రదాయాలు, సంగీతం పట్ల మరింత ప్రేమ పెరిగేలా గురునారాయణ కళాపీఠం వివిధ కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. గురజాడ, ద్వారం, ఆదిభట్ల , సుశీలమ్మ నడయాడిన పుణ్యభూమి అని చెప్పుకుంటాం.. మా కళ్లముందు సుశీలమ్మను పక్కనే చూడడం మా పూర్వజన్మసుకృతమని తెలిపారు. సుశీలమ్మ విజయనగర వాసి కావడం మనందరి అదృష్టమన్నారు. కళాపీఠం వ్యవస్థాపకుడు బి.ఎ.నారాయణ నేతృత్వంలో పవన్ చరణ్, సురభి శ్రావణి, సంతోష్ కిరణ్, బేబీలావణ్య లతి, హారిక, డాక్టర్ జి.సన్యాసమ్మ, వై.వి.సత్యనారాయణ పాడిన ఆపాత మధురాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ గౌరవ కార్యదర్శి నడిపేన శ్రీనివాసరావు, కోశాధికారి బి.పద్మావతి, గౌరవాధ్యక్షుడు డోల మన్మథకుమార్, జి.సాంబశివరావు, బి.ఎ.రాజారావు, మేకా కాశీవిశ్వేశ్వరుడు, వై.వి.వి.సత్యనారాయణ (అబ్బులు), అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

ఊరూరా ప్రచారం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఊరూరా, వార్డువార్డుకూ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలనను వివరిస్తున్నారు. మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

– సాక్షినెట్‌వర్క్



పార్వతీపురం మండలం నర్సిపురంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ఆత్మీయ స్వాగతం



పాలకొండ రూరల్: గొట్ట మంగళాపురంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి విజయ తిలకం దిద్దుతున్న మహిళ



సాలూరు పట్టణంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఎన్నికల ప్రచారం

క్లుప్తంగా

కోనేరులో యువకుడి గల్లంతు



కోనేరులో గాలిస్తున్న సిబ్బంది



గల్లంతైన ప్రభాస్

పాలకొండ: పట్టణంలోని వెంకటరాయుని కోనేరులో సోమవారం మధ్యాహ్నం ఓ యువకుడు గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కస్పావీధికి చెందిన మింది లక్ష్మణరావు, మణి దంపతుల చిన్నకుమారుడు ప్రభాస్(19) స్నానం కోసం కోనేరులో దిగి ప్రమాదవశాత్తు కాలు జారి మునిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుడి కోసం గాలింపు చేపట్టారు. కోనేరులో లోతుతో పాటు నీరు ఎక్కువగా ఉండడంతో రాత్రి వరకు మృతదేహం దొరకలేదు.

రిజర్వాయర్‌లో మత్స్యకారుడి మృతి



మృతుడు దేముడు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో పడిపోయి మత్స్యకారులు కె.దేముడు (54) మృతిచెందినట్లు ఎస్సై వై.వి.జనార్దన్ సోమవారం తెలిపారు. ఈ ప్రమాదంపై ఆయన మాట్లాడుతూ మార్చి 31వ తేదీన గ్రామానికి చెందిన తోరిక సూరన్నదొరతో కలిసి చేపల వేట చేసిన అనంతరం పడవపై మడ్డువలస రేవు వైపు వెళ్లి వేట చేసిన చేపలు విక్రయించి పటువర్ధనం రేవుకు తిరిగి వచ్చారు. కొద్దిసేపటి తరువాత తిరిగి చేపల వేట చేసేందుకు వెళ్లిన రిజర్వాయర్‌లోకి వెళ్లిన దేముడు ఆచూకీ తెలియలేదని ఆయన భార్య నూకమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ప్రాజెక్టు పరిసరాల్లో గాలించడంతో పటువర్ధనం రేవు వద్ద దేముడు మృతదేహాన్ని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు. మృతుడి స్వగ్రామం అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని రైవాడ గ్రామం. బతుకుతెరువు కోసం 20 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చి స్థిరపడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

3,200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట నిల్వల వద్ద ఎస్ఈబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ సిబ్బంది

బొబ్బిలి: స్థానిక ఎస్ఈబీ, విజయనగరం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సంయుక్తంగా జరిపిన దాడుల్లో బొబ్బిలి మండలంలోని కొయ్యకొండ వలసలో 3,200 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. సోమవారం జరిపిన ఈ దాడుల్లో ఎస్ఈబీ సీఐ బీవీ మురళీధర్,ఎస్సైలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

11 కిలోల గంజాయి పట్టివేత

భామిని: మండలంలోని బత్తిలి సమీపంలోని ఆంధ్ర–ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 11 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 11 కిలోల గంజాయితో పాటు, ఇద్దరు కేరళ వాసులను పట్టుకుని అరెస్టు చేసినట్లు బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ తెలిపారు. పట్టుకున్న ఇద్దరు నిందితుల్లో ఒకరు మగ, ఒకరు ఆడ వ్యక్తి ఉన్నారని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

టీడీపీ రెబల్ అభ్యర్థిగా గీత..?

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీసీ నేత మీసాల గీతకు తెలుగుదేశం పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో రెబల్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం పర్యటించి తన అనుచరులను కలిసి మద్దతు కోరారు. బీసీ వర్గానికి చెందిన తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెట్ దక్కకుండా స్థానిక నేత చేసిన అన్యాయం ప్రజలకు వివరించారు. ఆఖరి నిమిషం వరకు తనకు ఎంపీ టిక్కెట్ ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా పార్టీ మోసం చేసిందన్నారు. అనుచరుల ఒత్తిడి మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని చెప్పారు. మండలంలోని కోరుకొండ, కార్పొరేషన్ పరిధిలోని శాంతినగర్, బాబామెట్ట, ప్రదీప్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఆమె ప్రచారం సాగింది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹127	₹224	₹ 234

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి



బీజే పాలెం సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మంత్రి బొత్స సత్యనారాయణకు ఆశీస్సులు అందిస్తున్న స్థానిక మహిళలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆలోచనతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గరివిడి మండలంలోని బీజే పాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పాలన దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పాలన చేశాయని, ఇలాంటి పాలన ఎన్నడూ చూడలేదని, ఇది ఈ ప్రభుత్వం గొప్పతనమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మంచి పాలన అందుతోందని ఎంతో గర్వంతో చెప్తున్నామన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఈ గ్రామంలో అవ్వ తాతలతో పాటుగా 108 మంది పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛన్ అందేదని, చంద్రబాబు నాయుడు చేసిన కుట్రతో రెండు నెలల పాటు పింఛన్లు అందుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నీతి, నిజాయితీతో వలంటీర్లు గ్రామంలో సేవలందిస్తే వారిపై ఫిర్యాదు చేసి తప్పించారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే మీ ఇంటి వద్దకే పింఛన్లు అందుతాయని భరోసా ఇచ్చారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ఎలాంటి ప్రాధాన్యం కల్పించిందో విద్య, వైద్యానికి కూడా అంతే ప్రాధాన్యం కల్పించిందని చెప్పారు. మీ కుటుంబంలో మంచి,మేలు జరిగితే ఆలోచన చేసి ఆశీస్సులు అందించి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు. వైఎస్సార్ ప్రభుత్వంపై మరోసారి ఆదరాభిమానాలను చూపించాలని, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

పేదల పట్ల చంద్రబాబు దుర్మార్గం

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సభలో మాట్లాడుతూ పేదల పట్ల దుర్మార్గమైన ఆలోచనతో చంద్రబాబునాయుడు ఫిర్యాదు చేసి పింఛన్ పంపిణీని నిలిపివేశారన్నారు. మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు గ్యారంటీల పేరుతో ఓట్ల కోసం వస్తున్నారని మండిపడ్డారు. ఈ నియోజకవర్గంలో బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని గుర్తు చేశారు. ఈ సారి జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బొత్స సత్యనారాయణ, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్‌బాబు, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీ జి.శ్రీరాములు నాయుడు, స్థానిక సర్పంచ్ ముద్దాడ అనసూయ, ముద్దాడ రమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు

- ప్రథమ స్థానం సాధించిన ఏపీ జట్టు
- జట్టులో కీలకంగా మారిన జిల్లా క్రీడాకారులు

తెర్లాం: జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు అత్యుత్తమ ఆటతీరును కనబరిచి జాతీయస్థాయిలో ఏపీ జట్టు ప్రథమస్థానం సాధించేలా సత్తా చాటారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో 36వ జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు మూడు రోజుల పాటు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీలకు రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించిన జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఫైనల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ఏపీ జట్టు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించడానికి కృషి చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారుల్లో జ్యోతిప్రకాశ్(జెడ్పీహెచ్ఎస్–ఆరికతోట), జనార్దనసాయి (పీఎస్.బొడ్డవలస), రోహిత్, నాని (జెడ్పీహెచ్ఎస్, పారాది) ఉన్నారు. జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించిన జిల్లా క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు పీడీలు, పీఈటీలు అభినందించారు.

దగ్ధమైన సరుగుడు, శ్రీగంధం తోటలు



ప్రమాదంలో కాలిపోతున్న సరుగుడు, శ్రీగంధం వృక్షాలు

వేపాడ: మండలంలోని శింగరాయి రెవెన్యూలో గల ఏఎస్ఆర్ లే అవుట్‌లో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సరుగుడు, శ్రీ గంధం, జామ, కొబ్బరి తదితర వృక్షాలు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్.కోట అగ్నిమాపకాధికారి మదీనాతో పాటు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అలాగే వేపాడ శివారు బక్కునాయుడుపేటలో గ్రామానికి చెందిన చెలుబోను దేముడుకు సంబంధించిన పశువుల పాక దగ్ధమైంది. పాక కాలిపోతుండగా వెదురుపేలుళ్ల శబ్దానికి గ్రామస్తులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పశువులను కాపాడగలిగారు. అయితే పశువుల పాక, పక్కనే ఉన్న గడ్డివాము పూర్తిగా ఆహుతైంది.

హత్య కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని గురండి పోలీస్‌స్టేషన్ పరిధి తోటగుమ్మడలో మార్చి 29వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు సోమవారం ఛేదించారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సమక్షంలో హతుడు ఎం.లింగరాజు భార్య ఎం.జయలక్ష్మి, ఆమె ప్రియుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లా బత్తిలి గ్రామానికి చెందిన నెయ్యల ఉపేంద్రను విలేకరుల ఎదుట హాజరుపరిచారు. హతుడు లింగరాజు తమ్ముడు ఎం.పరశురాం ఫిర్యాదు మేరకు ఆదర్శపోలీసు స్టేషన్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవనంద నాయక్ ఆదేశాలతో గురండి పోలీసు అధికారి రవీంద్ర పాత్రో సిబ్బంది దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో ఎం.లింగరాజు (28) ఈనెల 28న గుసాని సమితి బట్టిసిరిపురంలో బంధువుల పెళ్లికి వెళ్లినట్లు తెలిసింది. భర్త పెళ్లికి వెళ్లిన విషయాన్ని భార్య జయలక్ష్మి ప్రియుడు నెయ్యల ఉపేంద్రకు ఫోన్‌చేసి చెప్పింది. నాలుగేళ్లుగా జయలక్ష్మి, ఉపేంద్రల మధ్య వివాహేతర సంబంధం ఉండడంతో అడ్డుగా ఉన్న లింగరాజును ఎలాగైనా హత్య చేయాలని ఇద్దరూ పథకం పన్నారు. అనుకున్నట్టుగానే పెళ్లికి వెళ్లిన లింగరాజును ప్రియుడు ఉపేంద్ర కలిసి డ్రింక్ తాగుదామని రాత్రి 9.50 గంటలకు ద్విచక్ర వాహనంపై తోటగుమ్మడ గ్రామం వైపు తీసుకెళ్లాడు. అనంతరం ఒకచోట తనతో తెచ్చుకున్న పదునైన స్క్రూ డ్రైవర్‌తో లింగరాజు మెడపై ఉపేంద్ర పొడిచాడు. దీంతో రోడ్డుపక్క ఎం.లింగరాజు పడిపోగా మెడ, ఛాతీపై 25 సార్లు, పొట్టలో 27 సార్లు పొడిచి హతుడి దగ్గరున్న బంగారు చైన్, ఉంగరం, సెల్‌ఫోన్ తీసుకుని బత్తిలి గ్రామం వైపు పారిపోయాడు. తీవ్రగాయాలతో ఎం.లింగరాజు సంఘటన స్థలంలో చనిపోయాడు. దర్యాప్తులో ఈ వివరాలను పోలీసులు గుర్తించి నిందితులను ఆదివారం అరెస్టు చేసి సోమవారం కోర్టుకు తరలించారు. నిందితుడి దగ్గరనుంచి బైక్, బంగారు చైన్, రింగు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మినహాయింపు ఇవ్వాలి..

విజయనగరం అర్బన్: దీర్ఘకాలిక వ్యాధులున్న ఉపాధ్యాయులకు పదో తరగతి పరీక్షపత్రాల మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీఈఓ ఎన్. ప్రేమకుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మూల్యాంకన రెమ్యూనిరేషన్ వివరాలు, ఏపీజీఎల్ఐకి సంబంధించిన వివరాలతో కూడి న కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మురళి, ఎంపస్వామి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పి.రాంబాబు, జి.రవి, జిల్లా కార్యదర్శులు బంగారయ్య, వాసుదేవ్, మండల కార్యదర్శులు వెం కటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామంలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కర్రి నాగరాజు, తాడివాడ అప్పన్న, నిమ్మ వెంకటరమణ, విసినిగిరి పాపారావు, రాగోలు సన్యాసి, కర్రి చిన్న తదితరులు ఉన్నారు. వారందరికి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల కంటే గ్రామంలో ఎక్కువ మెజారిటీ తీసుకురావాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థపై కక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- కూటమి నాయకుల శాడిజం
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు వారధిలా ఉన్న వలంటీర్లపై కక్ష పెంచుకున్న చంద్రబాబు నాయుడు, ఆయన కూటమి నాయకులు మాజీ ఎన్నికల అధికారిని అడ్డం పెట్టుకుని ఈసీకి ఫిర్యాదు చేసి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు టీడీపీ హయాంలోని ఇబ్బందులనే మళ్లీ తీసుకొచ్చే కుయుక్తులు పన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెన్షన్లు అందుకుంటున్న వృద్ధులకు అవస్థలుంటాయనే ఆలోచన కూడా చేయకుండా మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదును పరిశీలించిన ఈసీ కూడా వలంటీర్ల సేవలను నిలిపివేసిందని మండిపడ్డారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు తెల్లవారగానే 5నుంచి 6 గంటలకు పింఛన్లు ఇచ్చే పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చారని, ఈ పరిస్థితిని తట్టుకోలేని కూటమి పక్షాలు ఇలా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ఈ పరిస్థితులు చూసిన వలంటీర్లు కూడా తాము రాజీనామా చేసి సేవలను కొనసాగిస్తామనే నిర్ణయానికి రావడం చూస్తే కూటమి కుయుక్తులు ప్రజల్లో ఎంతగా నాటుకున్నాయో అర్థమవుతుందన్నారు. వలంటీర్లపై ప్రతిపక్షానికి ఎంత కసి ఉందో మేమూ అంతే కసిగా పనిచేస్తామని వలంటీర్లే స్వయంగా చెబుతున్నారన్నారు. పింఛనుదారులు సచివాలయాలకు వెళ్లి పింఛన్ అందుకోవాలంటే కష్టంతో కూడుకున్నదైనప్పటికీ ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించక తప్పదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదర రావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై దృష్టి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కర్‌రావు

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు గర్భిణులు, బాలింతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన ఆహార నియమాలు , వైద్య పరీక్షలు తదితర అంశాలపై కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిన దానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణిగా ఉన్న సమయంలో స్థానిక ఏఎన్ఎం దగ్గర గర్భస్థ వివరాలు నమోదు చేసుకునే టప్పుడు ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని తెలిపారు. గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాల నివృత్తి చేసే విధంగా వాయిస్ కాల్ సందేశం ఉంటుందని చెప్పారు. మహిళ గర్భం దాల్చిన నాలుగవ నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72 వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు. ఈ కాల్ సమయం సుమారు నిమిషం 30 సెకెన్లు కావున ప్రతి గర్భిణి పూర్తిగా వినడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణికి 01244451660 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని చెప్పారు. ఒక వేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే , ఐవీఆర్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఒక రోజులో 3 సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. మళ్లీ ఆసందేశాలను వినాలనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డీపీహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి, ఎస్ఓ ధర్మారావు, డీపీఓ జి.ఆర్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉన్న ఊరిలోనే 'ఉపాధి'



చీపురుపల్లి మండలం కర్లాంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

- 2.10 కోట్ల పనిదినాల లక్ష్యం
- 2.18 కోట్ల పనిదినాల కల్పన
- 65,441 మందికి 100 రోజుల పనిదినాలు

విజయనగరం ఫోర్ట్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనదారులకు అధిక సంఖ్యలో ప్రభుత్వం వారు ఉన్న ఊరిలోనే పని కల్పించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి వేతనదారులకు పనికల్పించారు. అదేవిధంగా 100 పనిదినాలు కూడా వేలాది మంది వేతనదారులకు అందాయి. పల్లెకు పండగ వచ్చిందన్న మాదిరి పల్లెలో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. ఉదయం 6 గంటలకల్లా గ్రామాల్లో ఉన్న వేతనదారులంతా పనిలో నిమగ్నమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది వేతనదారులు పనికి వెళ్తున్నారు. సొంత గ్రామంలోనే పనిదొరకడంతో వేతనదారులు ఆసక్తి చూపుతున్నారు. వేతనదారులకు కనీస వేతనం వచ్చే విధంగా చేయడం కోసం రెండు పూటలా పని కల్పిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తున్నారు.

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో 3.45 లక్షల జాబ్ కార్డులు, 6,11,286మంది వేతనదారులు ఉన్నారు. వారంతా ఉపాధి హామీ పనులకు వెళ్తారు. ఈ ఏడాది వేతనదారులకు ప్రభుత్వం లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి 2.10 కోట్ల పనిదినాలు వేతనదారులకు కల్పించాల్సి ఉండగా 2.18 కోట్ల పనిదినాలు కల్పించింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం వేతనదారులకు ఇచ్చే వేతనాన్ని రూ.270 నుంచి రూ.300కు పెంచింది. దీంతో ఈ ఏడాది వేతనదారులు మరింత ఎక్కువ సంఖ్యలో పనికి వచ్చే అవకాశం ఉంది.

65,441 మంది వేతనదారులకు పనికల్పన

ఉపాధిహామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు కల్గిన కుటుంబానికి 100 రోజులు పనికల్పించాలన్నది లక్ష్యం. 100 రోజులు పనికల్పించడం ద్వారా వచ్చే వేతనం ద్వారా కుటుంబ పోషణను వేతనదారులు చేసుకుంటున్నారు. ప్రతి కుటుంబానికి రూ.20 వేల రూ. 25 వేల వరకు వస్తుంది.

ఊరిలోనే పని బాగుంది



ప్రతి ఏటా చెరువు పనికి వెళ్లాను. ప్రతి ఏడాది పనికి వెళ్లడం ద్వారా మా కుటుంబానికి రూ.20 వేల వరకు వస్తుంది. ఈ పథకం రాకముందు ఇతర ప్రాంతాలకు పనికి వెళ్లేవారం. ఇప్పుడు ఉన్న ఊరిలోనే పని దొరుకుతోంది.

– బెల్లాన రామ్మూర్తి, వేతనదారు, బొబ్బిలి మండలం

ఎక్కువగా పనికి వస్తారు



మా గ్రామంలో ప్రతి రోజూ ఎక్కువ మంది వేతనదారులు పనికి వస్తున్నారు. ఎండ వల్ల ఉదయం 6 గంటలకే పని పెడుతున్నారు. వేతనం కూడా గిట్టుబాటు అవుతోంది. వారానికి రూ.1300 నుంచి రూ.1500 వరకు వస్తుంది.

– బి.రాముడమ్మ, వేతనదారు, కర్లాం గ్రామం, చీపురుపల్లి మండలం

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs / Back Logs) from recognised Universities. Exams in April/May. Cont ✆ : 73383 76874 [R-418]

PLOT FOR SALE

■ ప్లాటు అమ్మకానికి కలదు. బూడివీధి, అశోక్‌నగర్ (రామకృష్ణ స్కూల్ రోడ్)లో 160 చ॥గ॥ స్థలం. సంప్రదించండి. 94919 26443, 97051 43206. [S-1260687]

LAND FOR SALE

■ పొలం అమ్మకమునకు కలదు. కురుపాం మండలంలో పూతికవలస గ్రామం దగ్గరిలో 2 ఎకరముల 2పంటలు పండే పల్లపు భూమి (క్లీర్ టైటిల్) అమ్మకమునకు కలదు. కాంటాక్ట్. 9030208392, 8008335248 [S-1192058]

■ విజయనగరం జిల్లా జమ్మి మండలం జి.సింగవరం గ్రామంలో 1.35 ఎకరాలు సపోటా తోట అమ్మకానికి కలదు. సంప్ర : 90638 90162, 94406 60987, 81062 34196 [V- 36460]

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252718]

ASTROLOGY

■ శ్రీ గాయత్రీ దేవి జోతిష్య పీఠం : S.V.శాస్త్రి గారు గతం 20 సం॥ VZM స్థిరపడి ఉన్నారు. మీ ప్రొటన రేఖలు, హస్త రేఖలు, జాతర చక్రం చూసి సంపూర్ణ జోతిష్యం చెప్పబడును. వివాహం, సంతానం, ఆరోగ్యం, స్త్రీ పురుషులకు ఎటువంటి సమస్యలకైనా శాశ్వత పరిష్కారం చేయబడును. Opp. భాష్యం స్కూల్, VZM. ఫోన్ : 97017 78711 [V- 1817]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185014]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకువర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [HA-1420]

■ కష్టమైనది కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీరూమ్ +భోజనం. Hyd. Ph: 9014885406 [HA-1427]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.